ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
5★★ జిల్లా వార్తలు
సోమవారం 22 సెప్టెంబరు 2025

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెట్‌పల్లి టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల దృష్ట్యా మెట్‌పల్లి టౌన్-2 పరిధిలో విద్యుత్ సరఫరాకు సోమవారం అంతరాయం కలుగుతుందని మెట్‌పల్లి టౌన్ ఏఈ పి రవి ఒక ప్రకటనలో తెలిపారు. కేడీసీసీ బ్యాంక్, శ్రీలక్ష్మి పిల్లల హాస్పిటల్, సుల్తాన్‌పుర, క్లబ్ ఏరియాల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

మల్లాపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈనెల 22 నుంచి 29 వరకు ఒపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు జరుగుతాయని ఎంఈవో దామోదర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సిర్పూరా, చిట్టాపూర్ అధ్యాయన కేంద్రాల్లో చదివిన విద్యార్థులు జిల్లా కేంద్రంలో నిర్వహించే పరీక్షల్లో పాల్గొనాలని సూచించారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐఎంఏ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో జగిత్యాల మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న కంజర్ల విభావరి రాష్ట్రస్థాయి మొదటి బహుమతికి ఎంపికైంది. ఈ నెల 23న హైదరాబాద్‌లో ఈ బహుమతి ప్రదానం చేయనుండగా, కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు, లెక్చరర్‌లు, సిబ్బంది పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

గల్ఫ్ మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన గుర్రం మహేష్ అనే గల్ఫ్ కార్మికుడు సౌదీ దేశంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఈటీసీఏ ఫౌండర్ కిరణ్‌కుమార్ మృతుడి చిన్నారుల విద్యకోసం లక్ష రూపాయలను మృతుడి భార్య పూజారాణికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఈటీసీఏ అధ్యక్షుడు చీటీ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో గాడి తప్పుతున్న పాలన



- పన్ను వసూళ్లకే వార్డు ఆఫీసర్లు పరిమితం
- సొంత ప్రయోజనాలు కల్పించే పనులపై ఆసక్తి
- సమస్యల పరిష్కారానికి చొరవచూపని వైనం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

జగిత్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్ల పాలన గాడి తప్పుతోంది. అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి సమన్వయకర్తలుగా వ్యవహరించాల్సిన వార్డు ఆఫీసర్లు తమ బాధ్యతలను విస్మరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దిశానిర్దేశం చేయాల్సిన ఉన్నతాధికారులు ఏం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో వార్డు ఆఫీసర్లు కేవలం పన్నుల వసూళ్లు, సంక్షేమ పథకాలకే పరిమితమయ్యారు. వార్డు ఆఫీసర్‌పాలన లక్ష్యం మేరకు జరగడం లేదన్న విమర్శలున్నాయి. జిల్లా వ్యాప్తంగా అయిదు మున్సిపాలిటీల్లో 134 వార్డులుండగా అదేసంఖ్యలో వార్డు ఆఫీసర్లు పనిచేస్తున్నారు. జగిత్యాలలో 48 మంది, కోరుట్లలో 33మంది, మెట్‌పల్లిలో 26మంది, ధర్మపురిలో 15మంది, రాయికల్‌లో 12మంది వార్డు ఆఫీసర్లు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

● ఒక్కో వార్డుకు ఒక్కో ఆఫీసరు..

వార్డు పరిపాలన బలోపేతం చేసేందుకు ప్రభుత్వం రెండేళ్లక్రితం సిబ్బందిని నియమించింది. రెవెన్యూశాఖకు చెందిన వీఆర్‌ఏలను పురపాలక శాఖలో విలీనం చేసింది. వీరితో పాటు బల్దియాలోని 134మంది పర్మనెంట్ ఉద్యోగులు, బిల్ కలెక్టర్లు, వివిధ విభాగాలకు చెందిన వారిని గుర్తించారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీల్లో ప్రతీ వార్డుకు వార్డు ఆఫీసర్లను నియమించింది. వీరంద రూ వారికి కేటాయించిన వార్డుల్లో వివిధ బాధ్య తలు నిర్వర్తించాల్సి ఉంటుంది.

● కొరవడిన పర్యవేక్షణ...

వార్డు ఆఫీసర్లపై బల్దియా ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 15రోజులు నెలవారీగా మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ ప్రత్యేకాధికారి సమీక్షించి సమస్యలపై పరిష్కారమార్గాలు సూచించాలి. కానీ అవేమి అమలు కాకపోవడంతో వార్డు ఆఫీసర్లు ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తున్నారని పట్టణప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వార్డుఆఫీసర్ల పాలనను గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

● ఏం చేయాలి...

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేకాధికారులు, కమిషనర్లు, ఎమ్మెల్యేలు, మాజీ ప్రజా ప్రతినిధుల దృష్టికిరాని అనేక సమస్యలు క్షేత్రస్థాయిలో ఉత్పన్నమవుతుంటాయి. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషిచేయాలి. పౌరసేవల పట్టిక అమలుకోసం పనిచేయాల్సి ఉంటుంది. అధికారుల దృష్టికి వచ్చే.

(మిగతా 8లో..)

రహదారిపై మురుగు ప్రవాహం


డ్రైనేజీ లేకపోవడంతో రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు, దెబ్బతిన్న ఇంకుడు గుంత

మల్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ కాలనీ సమీపంలో డ్రైనేజీ లేకపోవడంతో మురుగు నీరు రహదారిపై ప్రవహిస్తోంది. డ్రైనేజీ నిర్మించాలనే స్థానికుల విన్నపాలను పట్టించుకోకపోవడంతో మురుగు నీరు ఇళ్లలోకి వస్తుందని, అక్కడే గల ఇంకుడుగుంత కూడా మురుగునీటికి దెబ్బతిన్నదని వాపోతున్నారు. మురుగునీరుతో దుర్వాసన, వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నేటి ప్రజా వాణి రద్దు: కలెక్టర్

జగిత్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో ఈనెల 22వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన ప్రజా వాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనుండడంతో ప్రజావాణిని రద్దు చేసినట్లు ప్రకటించారు. ప్రజలు గమనించాలని వినతులను ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ సూచించారు.

క్రీడలతో మానసికోల్లాసం


మాట్లాడుతున్న సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు

కొడిమ్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ మెన్నేని రాజనర్సింగరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన స్వర్గీయ మెన్నేని ప్రేమలత మురళీధర్‌రావు స్మారక కేపీఎల్ 2 క్రికెట్ టోర్నమెంట్‌ను రాజనర్సింగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వానికి దోహదపడుతాయన్నారు. 10 టీంల మధ్య జగిగే టోర్నమెంట్‌ను పది రోజులు నిర్వహిస్తామన్నారు. సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మల్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం జీవన్‌రెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ప్రసాద్, యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, వెంకటేశ్వర క్రికెట్ క్లబ్ సభ్యులు మోహనాచారి, లక్ష్మణ్, డేవిడ్, సురేందర్‌రెడ్డి, రాకేష్, నాగార్జున, మహేష్, శేఖర్ పాల్గొన్నారు.

బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలో..


మల్యాల మండలం రాంపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

- బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం

ధర్మపురి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో బతుకమ్మ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా క్షేత్రంలోని మున్సిపాలిటీ, వివిధ వీధుల్లో, కోనేరు వద్ద అనేక మంది మహిళలు, యువతులు, చిన్నపిల్లలు సాంప్రదాయ రీతిలో తెలంగాణ జానపద, బతుకమ్మ, గౌరీ దేవి పాటలుపాడుతూ ఆటలు ఆడారు. రాత్రి వేళలో బతుకమ్మలను వాడలో ఏర్పాటు చేసిన గుంతలు, కోనేరు, గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. స్థానిక మున్సిపాలిటీ వద్ద ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ సహా, మాజీ మహిళా కౌన్సిలర్లు, రిసోర్స్ పర్సన్లు ఒకే రకం చీరెలు ధరించి బతుకమ్మ ఆట ఆడారు. ఈ సందర్భంగా పట్టణ పురపాలక సంఘం ఆధ్వర్యంలో వివిధ వీధుల్లో, కోనేరు, గోదావరి నది వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశాయి. ఏర్పాట్లను మున్సిపల్ కమిషనన్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, మేనేజర్ బాలె గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్యాల గంగాధర్, సిబ్బంది పర్యవేక్షించారు.

బతుకమ్మ పండుగ ఆత్మగౌరవ ప్రతీక

తెలంగాణ మహిళలు బతుకమ్మ పండుగను ఆత్మగౌరవ ప్రతీకగా భావిస్తారని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని మున్సిపల్ కార్యాల యం వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ ఉత్సవా లను ఆదివారం రాత్రి ఆయన తిలకించి మాట్లాడారు. బతుక మ్మ చీరెలు మహిళా సంఘాల సభ్యులకే ఇవ్వాలని నిర్ణయించగా మంత్రివర్గం నుంచి తామం దరం ప్రతీ ఒక్క మహిళలకు చీరె అందించాలని సూచించినట్లు ఆయన అన్నారు. ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యుడు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది బతుకమ్మను ఆడారు. కార్యక్ర మంలో ఎం పీవో రవిబాబు, పంచాయితీకార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్యాల: మండలంలో బతుకమ్మ వేడుకలు ప్రారంభం అయ్యాయి. రాంపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. మహిళలు పెద్ద ఎత్తు న తరలివచ్చి బతుకమ్మ ఆడారు.

రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు అన్ని గ్రామాల్లో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఇటిక్యాల పద్మశాలి సంఘ భవనంలో వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ సర్పంచ్ సామల లావణ్యవేణు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కోరుట్ల/కొడిమ్యాల/వెల్గటూర్: కోరుట్ల పట్టణం, కొడిమ్యాల, వెల్గటూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ రూపంలో మహిళలు గౌరమ్మను కొలిచారు.







ధర్మపురిలోని మున్సిపాలిటీ వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు, వేడుకల్లో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కొడిమ్యాల, కోరుట్లలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, జగిత్యాల రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో బతుకమ్మతో ఉద్యోగులు

త్వరలో నీటి సమస్యకు పరిష్కారం


మాజీ మంత్రి జీవన్ రెడ్డికి బతుకమ్మతో స్వాగతం పలుకుతున్న మహిళలు

రాయికల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో నీటి సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపిస్తానని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వీరాపూర్‌లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డికి గ్రామ మహిళలు బతుకమ్మతో స్వాగతం పలికారు. గ్రామంలో నీటి సమస్యను అడిగి తెలుసుకుని అధికారులకు ఫోన్‌లో సమస్యను వివరించారు. బోరు, నీటి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లమ్మ ఆలయంలో ప్రహరీ కూలిపోవడంతో పైపులైన్ డైవర్ట్ చేయాలని అధికారులకు సూచించారు. గ్రామంలో ఇటీవల వరద తీవ్రతను దెబ్బతిన్న రోడ్లను, కల్వర్టులను పరిశీలించి అధికారులతో మాట్లాడి వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

రాయికల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2025ను అందుకున్న ఎంపీపీఎస్ రాయికల్ ప్రధానోపాధ్యాయుడు దొంతి సతీష్‌ను పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మిత్రులు కోల రాజు, డాక్టర్ గట్టు నరేష్, తిరుపతి, రంజిత్, అజయ్, సురేష్, అనిల్, విజయ్ రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- అరికట్టడంలో అధికారుల విఫలం
- ట్రాక్టర్లను అడ్డుకున్న లక్ష్మీపూర్ గ్రామస్థులు

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని గ్రామాల్లో జోరుగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. గోదావరి నది తీరం నుంచి జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్, లక్ష్మీపూర్, అనంతారం, తిప్పన్నపేట, చర్లపల్లి గ్రామాల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ దళారులు సొమ్ము చేసుకుంటూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారని జగిత్యాల రూరల్ మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

● రోజుకు 30-40 ట్రిప్పులు..

జగిత్యాల మండలం మీదుగా రోజుకు దాదాపు 30 నుంచి 40 ట్రిప్పుల వరకు అక్రమంగా ఇసుక రవాణా అవుతోందని సమాచారం. దళారులు ధర్మపురి, బీర్‌పూర్ గోదావరి పరివాహక ప్రాంతాలతో పాటు అనంతారం వాగు నుంచి లారీలు, ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. తెల్లవారుజాము న, రాత్రి సమయాల్లో దొంగచాటున ఇసుకను జగిత్యాల జిల్లా కేంద్రంతోపాటుగా, జగిత్యాల రూరల్ మండలంలోని గ్రామాలకు ఇసుకను తరలిస్తూ ఇసుకను నిల్వ చేసి అవసరం మేరకు మార్కెట్‌లో విక్రయించి దళారులు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణా సాగుతున్నట్లు సమాచారం అందించినా అధికార యంత్రాంగం చోద్యం చూస్తున్నట్లు పలు గ్రామాల గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పోలీసులు, ఆడపదడపా తనిఖీలు చేస్తూ ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటున్నా మండలంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు.


లక్ష్మీపూర్ గ్రామస్థులు పట్టుకున్న ఇసుకట్రాక్టర్ (ఫైల్)

● నంబర్‌ప్లేట్లు లేని వాహనాల్లో..

జగిత్యాల రూరల్ మండలంలోని గ్రామాల్లో గోదావరి పరివాహక ప్రాంతాల నుంచి ఇసుకను అర్ధరాత్రి సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా నంబర్ ప్లేట్లులేని ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. రెండు రోజుల క్రితం లక్ష్మీపూర్ గ్రామస్థులు ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను అడ్డుకొని నెంబర్ ప్లేట్ లేకుండా, ఎలాంటి అనమతులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఎలా రవాణా చేస్తున్నారని ఇసుకను రవాణా చేస్తున్న వ్యక్తులను నిలదీశారు. అర్ధరాత్రి సమయంలో అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను లక్ష్మీపూర్ గ్రామస్థులు పట్టుకున్నారు. ఇకపై అక్రమంగా ఇసుకను రవాణా చేయవద్దని గ్రామస్థులు ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తులను హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా కట్టడి కోసం గ్రామస్థులు స్పందించి చొరవ చూపుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్రవిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణాను కట్టడిచేసి ప్రభుత్వ ఖజానాను, భూగర్భ జలాలను కాపాడాలని జగిత్యాల రూరల్ మండల ప్రజలు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

సుధాకర్, సీఐ, జగిత్యాల రూరల్



అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నాం. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులను గుర్తించి ఇసుక అక్రమ రవాణాను అరికడతాం.

నవరాత్రోత్సవాల కరపత్రం ఆవిష్కరణ

రాయికల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ గ్రామంలో విజేత యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 22వ దుర్గా శరన్నవరాత్రోత్సవాల కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో విజేత యూత్ అధ్యక్షుడు సోమ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులవివక్ష చూపిన వారిపై చర్యలు తీసుకోవాలి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో దళిత అటెండర్ పై కులవివక్ష చూపి అవమానించినవారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా మాల మహానాడు ఆఫ్ ఇండియా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ దళిత మహిళను కులవివక్షకు గురిచేయడం చాలా బాధాకరమని అన్నారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం కలకలం రేపుతోందన్నారు. పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మద్యం మానేయాలని మందలించినందుకు వృద్ధుడి ఆత్మహత్య


రాజయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ వ్యక్తిని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్థాపం చెందిన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణ పూర్‌లో పండుగ పూట ఆదివారం విషాదం నింపింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని రాయికోటి రాజయ్య(61) కొంత కాలంగా గల్ఫ్ దేశానికి వెళ్లి వస్తుండేవాడు. ఏడాది కిందట స్వగ్రామానికి చేరుకున్న ఆయన స్థానికంగా దినసరి కూలీ పనులు చేస్తున్నాడు. అనారోగ్యంలో బాధపడుతున్న రాజయ్యను కుటుంబసభ్యులు పలు ఆసుపత్రుల్లో చూపించి వైద్యం అందించారు. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో కుటుంబ సభ్యులు మద్యం మానేయాలని రాజయ్యను ఈనెల 20న మందలించారు. మనస్థాపం చెందిన ఆయన రేకుల షెడ్డులో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి భార్య శోభారాణి, కొడుకు బాబు, ఇద్దరు కూతుళ్లు తిరుమల, రాజేశ్వరిలు ఉన్నారు. మృతుడి భార్య శోభారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ మోతీరాంనాయక్ పేర్కొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలవన్మరణం

● పెళ్లయి ఆరు నెలలు ● చందుర్తిలో విషాదం


అరవింద్(ఫైల్)

చందుర్తి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెళ్లయిన ఆరు నెలలకే ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కుటుంబ కలహాలతో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లాఅటవీప్రాంతంలో జరగగా, చందుర్తి మండల కేంద్రంలో విషాదం నింపిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. చందుర్తి మండల కేంద్రానికి చెందిన ద్యావనపల్లి లక్ష్మి-రాజు దంపతుల ఏకైక కుమారుడు అరవింద్(30) వివాహం కరీంనగర్‌లోని జూబ్లీనగర్‌కు చెందిన తుమ్మ స్వరూపరాణి-శ్రీనివాస్ దంపతుల కుమార్తె వినూత్నతో గతమార్చి2న వివాహం జరిగింది. భార్యభర్తలు ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కావడంతో హైదరాబాదులోని కొండాపూర్ ప్రాంతంలో నివాసం ఉంటూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఈనెల 19న కుటుంబ కలహాలతో అరవింద్ ఇంటి నుంచి బయటకు వెళ్లి వికారాబాద్ అటవీప్రాంతంలో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడగా అక్కడి పోలీసులు గుర్తించి, రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో ఉంటున్న తల్లిదండ్రులకు పోలీసులు ఈనెల 20న రాత్రి సమాచారం అందించారు. భార్య వినూత్న ప్రస్తుత గర్భవతని పేర్కొన్నారు. పెళ్లయిన ఆరు నెలలకే అరవింద్ ఆత్మహత్యకు పాల్పడడంతో చందుర్తిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


మల్లేష్ నాయక్(ఫైల్)

ధర్మారం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంట పొలాన్ని నష్టపరుస్తున్న పక్షులను తోలడానికి వెళ్లిన ఓవ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన భూక్య మల్లేష్ నాయక్(45) పొలాన్ని నష్టపరుస్తున్న పక్షులను తోలడానికి ఆదివారం మధ్యాహ్నం వెళ్లాడు. ఈ ప్రయత్నంలో పక్షులు బెదిరే కలర్ రిబ్బన్‌కు ఒక వైరును కట్టి 11కేవీ వైర్లకు వేయగా ప్రమాదవశాత్తు రిబ్బన్ ద్వారా విద్యుత్ సరఫరా అయ్యి మల్లేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మల్లేష్ భార్య భూక్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

గుడుంబా విక్రయదారుడిపై కేసు నమోదు

ధర్మారం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గుడుంబా తయారు చేసి అమ్ముతున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన భూక్య మోతిలాల్ నాయక్ పొలంలో గుడుంబా తయారు చేస్తూ ఇంటి వద్ద విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం మోతిలాల్ ఇంటిని తనిఖీ చేసి 12 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేశారు. నాటుసారా తయారు, విక్రయించిన, సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ధర్మారం ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు.

మెప్మా ఆర్పీలకు తప్పని తిప్పలు


జగిత్యాల కలెక్టరేట్‌కు తరలివచ్చిన మెప్మా రిసోర్స్‌పర్సన్లు

● పీఆర్సీ అమలు కోసం ఎదురుచూపులు
● కనీస గౌరవ వేతనం రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్
● రాష్ట్రంలో ఆరు వేల మంది మెప్మా రిసోర్స్‌పర్సన్లు

జగిత్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) రిసోర్స్ పర్సన్లు (ఆర్పీ) కనీస గౌరవ వేతనం దక్కక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్పీలకు పీఆర్సీ అమలు కాక పోవడంతో రూ.6 వేల గౌరవ వేతనం మాత్రమే అందడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు నిధులు సమకూర్చడం, శిక్షణ ఇవ్వడం వంటి పనులను ఆర్పీలు పూర్తి చేస్తారు. పట్టణాల్లోని పొదుపు సంఘాల మహిళలకు ఆర్థికంగా అండగా నిలుస్తుంటారు. సంఘాల కార్యకలాపాలు సక్రమంగా జరిగేలా చూడడంలో కీలక పాత్ర పోషిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా మున్సిపాలిటీల్లో 6 వేల మంది మెప్మా రిసోర్స్ పర్సన్లుగా పనిచేస్తున్నారు. జగిత్యాల జిల్లాలో 173 మంది మెప్మా ఆర్పీలు పనిచేస్తున్నారు.

నెలకు రూ. 600 నుంచి పనిచేస్తున్న ఆర్పీలు..

రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం మెప్మా ఆర్పీలకు నెలకు 600 పారితోషికం అందించేది. 2018 నుంచి ఆర్పీలకు ప్రభుత్వం నుంచి నెలకు నాలుగు వేల రూపాయల గౌరవ వేతనం, పట్టణ సమాఖ్య నుంచి మరో రెండు వేల రూపాయలు కలిపి ఆరు వేల రూపాయల చొప్పున గౌరవ వేతనాన్ని స్త్రీ నిధి ద్వారా చెల్లిస్తున్నారు. ఇచ్చే తక్కువ వేతనం కూడా ప్రభుత్వం ఇవ్వకుండా స్త్రీ నిధి ద్వారా పారితోషికం పేరుతో ఇవ్వడాన్ని పలువురు ఆర్పీలు వ్యతిరేకిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక పర్యాయాలు మంత్రులు, కలెక్టర్లుకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా చేశారు. అయినా వారి సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల జగిత్యాల జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి మెప్మా ఆర్పీలు తరలివచ్చి తమ అసంతృప్తిని వ్యక్తం చేయడంతో పాటు అధికారులను కలిసి సమస్యను విన్నవించుకున్నారు. కనీస గౌరవ వేతనం ఏ నెలకు ఆ నెల అందించాలని సంబంధిత అధికారులను కోరారు.

30 శాతం పీఆర్సీ అమలుకు డిమాండ్..

జీవో నంబరు 164 ప్రకారం స్త్రీనిధి, లోకల్ బాడీ నిధుల నుంచి ఆర్పీలకు గౌరవ వేతనాలు ఇవ్వాలనే నిబంధనను తొలగించి సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) వీఓఏల మాదిరిగా ప్రభుత్వ పరంగా ప్రత్యేక నిధులు కేటాయించి గౌరవ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. నెలకు రూ.20 వేల గౌరవ వేతనం అందించాలని కోరుతున్నారు. గౌరవ వేతనాన్ని ఏ నెలకు ఆ నెల స్వంత ఖాతాల్లో జమ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తం గా ఆర్పీలకు ఒకే రకమైన డ్రెస్ కోడ్ ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరు తున్నారు.

గత ప్రభుత్వం అన్ని రంగాల వారికి 30 శాతం పీఆర్సీ అమలు చేసి మెప్మా ఆర్పీలను మాత్రం విస్మరించిందని అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సెర్ప్ వీఓఏల మాదిరిగా మెప్మా ఆర్పీలకు పీఆర్సీ అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మెప్మా ఆర్పీలకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలని కోరుతున్నారు. పని భారం తగ్గించాలని, హెచ్ఆర్ఏ అమలు చేయాల ని వారు డిమాండ్ చేస్తున్నారు. మెప్మా కార్యకలా పాల్లో బాగంగా వివిధ సర్వేలు నిర్వహిస్తామని ఇప్పటికైనా ప్రభుత్వం మెప్మా ఆర్పీల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు.

పీఆర్సీఅమలు చేయాలి

రమ, జిల్లా మెప్మా రిసోర్స్ పర్సన్ సంఘం అధ్యక్షురాలు, జగిత్యాల

ప్రభుత్వం మెప్మా రిసోర్స్ పర్సన్లకు 30 శాతం పీఆర్సీ అమలు చేయాలి. ప్రతీ నెల సక్రమంగా వేతనాలు చెల్లించాలి. అరకొరగా ఇస్తున్న గౌరవ వేతనాలు సైతం ఎప్పటికప్పుడు అందించక పోవడంతో ఆర్థికంగా అవస్థలు ఎదుర్కొం టున్నాం. మెప్మా ఆర్పీలకు నెలకు రూ.20వేల గౌరవ వేతనం అందించాలి.



ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లాం

దుర్గపు శ్రీనివాస్‌గౌడ్, మెప్మా అధికారి, జగిత్యాల

మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. సమస్యను పరిష్కరించడానికి అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నాం. మెప్మా ఆర్పీల డిమాండ్లను రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం పరిష్కరించాల్సి ఉంటుంది.



రైల్వేస్టేషన్ గదిలో విందు


గదిలో మద్యం బాటిళ్లు

ఓదెల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి టికెట్ కౌంటర్ గదిలో రైల్వే కమర్షియల్ అధికారులు విందు చేసుకున్నారు. రాత్రి 10గంటల తర్వాత రైల్వే స్టేషన్‌లో కేకలు, కేరింతలు వినబడడంతో స్టేషన్‌సమీపంలో ఉండే ఓవ్యక్తి విందును సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. దీనిని గమనించిన కొందరు అధికారులు వారించారు. అయినప్పటికీ చిత్రీకరించిన వీడియోను వాట్సప్‌లో వైరల్ చేయడంతో విషయం బయటకు వచ్చింది. ఇందులో కమర్షియల్ అధికారులతోపాటు కొందరు టీసీలు కూడా ఉన్నట్లు సమాచారం. ఈవ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై లక్పతి తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని వంతడుపుల గ్రామసమీపంలోని బిక్కవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడిచేయగా ట్రాక్టర్ పట్టుబడినట్లు తెలిపారు. ట్రాక్టర్ యజమాని ముద్దల అజయ్, డ్రైవర్ దాసరి సిద్ధార్థలపై కేసునమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలు


విజేతలైన విద్యార్థులతో అతిథులు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కల్యాణ మండపంలో ఆదివారం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయిలో విద్యార్థులకు భగవద్గీత పఠనపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ ఇన్‌చార్జి అక్షయ చైతన్య మాట్లాడుతూ గీతతో సత్ప్రవర్తన, జ్ఞాపకశక్తి, దేశభక్తి అలవడుతాయన్నారు. ఆధ్యాత్మిక మార్గంతో జీవనవిధానం మెరుగుపడుతుందన్నారు. మొత్తం 2వేల మంది విద్యార్థులకు గీతా శ్లోకాలు నేర్పించామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆలయ ట్రస్టు చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్, మిషన్ ప్రధాన కార్యదర్శి గజవాడ శ్రీనివాస్, జలంధర్, కొండయ్య, రజనీకాంత్, చంద్రం, వసంతం, అనుదీప్, విఘ్నేశ్వర్, శ్రీనివాస్, తిరుపతి, సుదర్శన్, రాజేశ్వర్ తదితరులు పాల్గొ న్నారు.

● జిల్లా స్థాయి విజేతలు

ప్రతీ గ్రూపులో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందించగా బి లో వేదాంశ్, సుదేష్ణ, వినయ్, సిలో కె.అద్వైత్, ఎం. సాన్విక, ఇ.స్నితిక, డిలో మ్యాన శ్రీహిత, బి.మనస్వి, పి.వర్షిత్, ఈ లో శ్రీశాన్వి, కె.తేజస్వి, గాజుల తేజస్వి గెలుపొందారు. వీరికి త్వరలో రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు.

వ్యవసాయబావిలో పడి వృద్ధురాలు మృతి

మానకొండూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన గట్టు నర్సమ్మ(85) అనే వృద్ధురాలు వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముంజంపల్లికి చెందిన నర్సమ్మకు కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేదు. ఈ నెల 17న తిమ్మాపూర్ మండలంలోని పొరండ్ల గ్రామంలో ఉండే కూతురు వద్దకు వెళ్లింది. అక్కడి నుంచి 19న ముంజంపల్లికి ఆటోలో వచ్చి సమీపంలోని వ్యవసాయబావిలో పడింది. ఆదివారం వ్యవసాయబావిలో మృతదేహాన్ని గుర్తించిన ఓ రైతు గ్రామస్థులకు తెలియజేయడంతో అక్కడికి వెళ్లి చూడగా నర్సమ్మగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారుడు వెంకటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మానేరు వాగులో పడి ఒకరి మృతి


రవీందర్‌గౌడ్(ఫైల్)

ఓదెల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంపుల మానేరువాగులో ఆదివారం ఇల్లంతకుంట మండలం రాచపల్లికి చెందిన ఆరెల్లి రవీందర్‌గౌడ్(50) అనేవ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఉదయం మానేరు తీరానికి వచ్చిన రవీందర్ నీటిలో ఈదుకుంటూ వస్తుండగా అంతలోనే ఫిట్స్ రావడంతో నీటిలో ఊపిరాడక మృతి చెందాడని గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య రమ, ఇద్దరు కుమారులున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

రహదారిపై కొండ చిలువ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని ఓ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాల సమీపంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి కొండ చిలువ ప్రత్యక్షమైంది. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ వద్ద నుంచి వెళుతోంది. గమనించిన వాహనదారులు ఆగి హతమార్చేందుకు యత్నించారు. రాళ్లతో కొట్టడడంతో కొండచిలువ తప్పించుకుని పక్కనే ఉన్న వ్యవసాయ పొలాల్లోకి వెళ్లింది.


రోడ్డు పక్కనుంచి వెళుతున్న కొండచిలువ

కాలనీలో వ్యక్తి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీలంక షిర్కే ప్రాంతానికి చెందిన పెనుగొండ కుమార్ (38) ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సమస్యల కారణంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. గోదావరిఖని టుటౌన్‌సీఐ ప్రసాద్‌రావు మృతదేహాన్ని ప్రభుత్వఏరియా ఆసుపత్రికి తరలించారు.

రైతును కాటేసిన నాగుపాము

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో ఆదివారం రైతు సత్తయ్యను నాగుపాము కాటేసింది. స్థానికుల కథనం ప్రకారం.. సత్తయ్య రోజులాగే వ్యవసాయక్షేత్రానికి వెళ్లాడు. పొలంలో తిరుగుతుండగా అతన్ని పాము కరిచింది. వెంటనే అతన్ని తోటి రైతులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారని ప్రస్తుతం సత్తయ్య ఆరోగ్యం నిలకడగా ఉందని వారు స్పష్టం చేశారు.

నీటి ట్యాంక్‌లో పడి ఇద్దరు చిన్నారుల మృతి

● బొమ్మకల్ సిమెంట్ పైపుల ఫ్యాక్టరీలో ఘటన


చిన్నారుల మృతదేహాలు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లారుముద్దుగా ఉన్న ఇద్దరు చిన్నారులు ఇంటి బయట ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి ట్యాంక్‌లో పడి మృతి చెందారు. కరీంనగర్ శివారులోని బొమ్మకల్‌లో చోటు చేసుకున్న సంఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. కరీంనగర్ రూరల్‌సీఐ, స్థానికుల వివరాల ప్రకారం... కరీంనగర్ శివారులోని బొమ్మకల్ రోడ్‌లో ఉన్న సత్యం సిమెంట్‌పైపుల ఫ్యాక్టరీలో బీహార్‌కు చెందిన సహానీ బిట్టుకుమార్, అతడి భార్య సుధాదేవి ఐదేళ్ల నుంచి కూలీలుగా పని చేస్తున్నారు. ఇద్దరు కొడుకులు, కూతురుతో ఫ్యాక్టరీ ఆవరణలోని షెడ్డులో నివాసం ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో బిట్టుకుమార్‌మార్కెట్‌కు వెళ్లాడు. భార్య సుధాదేవి ఇంట్లో పనిచేసుకుంటూ ఉంది. కూతురు కూడా ఇంట్లోనే ఉండగా ఇద్దరు కుమారులు సత్యం కుమార్(4), ఆర్యన్‌కుమార్(2) బయట ఆడుకుంటున్నారు. కొంతసేపటికి తల్లి సుధాదేవి బయటకు వచ్చి చూడగా వారు కనిపించలేదు. దీంతో ఫ్యాక్టరీ అవరణలో చూడగా పైపులు క్యూరింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌లో ఆర్యన్‌కుమార్ మృతదేహం నీటిపై తేలి కనిపించింది. దీంతో ఫ్యాక్టరీలోని కూలీలకు విషయం తెలుపగా అర్యన్‌కుమార్‌ను బయటకు తీశారు. నీటిలోపల వెతకగా సత్యంకుమార్ మృతదేహం కూడా లభ్యమైంది. సమాచారం అందుకున్న కరీంనగర్ రూరల్‌సీఐ నిరంజన్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చిన్నారుల మృతదేహాలను కరీంనగర్ ప్రభుత్వఆసుపత్రి మార్చురీ గదిలోభద్రపరిచారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సెలవురోజు కాకపోతే కాపాడేవారేమో..

ఆదివారం సెలవుదినం కాబట్టి ఫ్యాక్టరీలో పనులు బంద్ చేయడంతో ఆవరణలో కూలీలు ఎవరూ లేరు. కొందరు వారివారి గదుల్లో ఉండగా మరికొందరు మార్కెట్, ఇతరపనుల్లో బిజీగా ఉన్నారు. ఇద్దరు చిన్నారులు బయట ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి ట్యాంక్‌లో పడ్డారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో గమనించలేదు. ఫ్యాక్టరీ పనివేళల్లో ఐతేఎవరైనా సిబ్బంది గమనించి కాపాడేవారంటూ కుటుంబ సభ్యులు రోధించారు. కూతురు(6) తనతమ్ముళ్లతోకలిసి ఆడుకున్నా ఈ విషయం వెంటనే తల్లికి తెలిసేదని, తల్లితో ఇంట్లో ఉందని చెబుతున్నారు. ఐదేళ్లుగా ఇదే ఫ్యాక్టరీలో పనిచేస్తున్నామని, ఎప్పుడూ ఇలాంటి ఘటన జరగలేదని కూలీలు వాపోయారు. ఫ్యాక్టరీ ఆవరణలో కూలీలు, వారిపిల్లలు నివాసం ఉంటుండడంతో వాటర్ ట్యాంక్‌తో ప్రమాదాలు జరుగకుండా ఫ్యాక్టరీ యాజమాన్యం భద్రతాచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వాటర్ ట్యాంక్ వద్దకు ఎవరూ వెళ్లకుండా ఏర్పాటు చేయకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు ఉన్న చోట తగినజాగ్రత్తలు తీసుకుంటే ఇటువంటి ఘటనలు జరిగేందుకు ఆస్కారం ఉండదని, ఇప్పటికైనా ఇటువంటి ప్రమాదకరమైన స్థలాలకు చిన్నారులను దూరంగా ఉంచేలా చర్యలు అధికారులు తీసుకోవాలని ప్రజలు కోతున్నారు.

పోలీసులు కొట్టారని సెల్‌టవర్ ఎక్కి నిరసన

● బాధితుడికి కౌన్సెలింగ్ నిర్వహించిన పోలీసులు


కౌన్సెలింగ్ ఇచ్చేందుకు శ్రీనివాస్‌ను తీసుకెళ్తున్న పోలీసులు

హుజూరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసులు తనను కొట్టారని నిరసిస్తూ హుజూరాబాద్‌లో ఆదివారం సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేసిన సంఘటన చోటుచేసుకుంది. వివరాలుఇలా ఉన్నాయి.. హుజూరాబాద్ పట్టణంలోని మామిండ్లవాడకు చెందిన శ్రీనివాస్ దళిత బంధు పథకం కింద డీజే సౌండ్స్‌ను కొనుగోలు చేసి వ్యాపారం చేసుకుంటున్నాడు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం రాత్రి దుర్గామాత విగ్రహాన్ని డీజేతో ఊరేగింపుగా తీసుకెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో శ్రీనివాస్, పోలీసుల మధ్య మాటమాట పెరగడంతో, డిజే సౌండ్స్‌ను సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులు తనపై చేయి చేసుకున్నారని మనస్తాపానికి గురైన శ్రీనివాస్ సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, కుటుంబసభ్యులు సెల్‌టవర్ దిగాలని విజ్ఞప్తి చేశారు. పోలీ సులు వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో శ్రీనివాస్ టవర్ దిగాడు. టౌన్ సీఐ కరుణాకర్ శ్రీనివాస్‌కు కౌన్సెలింగ్ నిర్వహించి, మరోసారి ఇలా చేయవద్దని హెచ్చరించారు. అనంతరం సీఐ కరుణాకర్ మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా డీజేలు పెట్టరాదన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి(45) మరణించినట్లు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మృతుడు తెలుపు షర్ట్, బ్లూకలర్ జీన్స్‌పాయింట్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీగదిలో భద్రపరిచినట్లు తెలిపారు. గుర్తించి నవారు వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక


పతకాలతో విద్యార్థులు

కోరుట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు చెందిన తైక్వాండో కరాటే విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మాస్టర్ రమేష్ ఆదివారం తెలిపారు. ఈ నెల 20వ తేదిన జగిత్యాల జిల్లా కేంద్రంలోని తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు చెందిన విద్యార్థులు పాల్గొని వివిధ విభాగాల్లో రాణించినట్లు తెలిపారు. తైకాండో క్లబ్ కరాటే శిక్షణ పొందిన విద్యార్థులు అండర్-14, అండర్-17 కేటగిరి వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 20 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. ఇద్దరు గోల్డ్ మెడల్, ఆరుగురు సిల్వర్ మెడల్స్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు జిల్లా స్కూల్ గెమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి చక్రధర్‌రావు మెడల్స్‌ను అందించి అభినందించారు. విద్యార్థులను తైక్వాండో అసోషియేషన్ సభ్యులు సంతోష్ కుమార్, గంగారావు, నావనంది రమేష్ అభినందించి సన్మానించారు.



దొంగలున్నారు జాగ్రత్త

- ఇంటికి తాళం కనపడిందో... తెల్లవారేసరికి సొమ్ములు చోరీ
- విలువైన బంగారం, డబ్బులు ఇళ్లలో పెట్టవద్దని పోలీసుల సూచన

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులంటే పిల్లలతోపాటు తల్లిదండ్రులకు ఉత్సాహంగా ఉంటుంది. స్వగ్రామాలు, పల్లెటూళ్లకు వెళ్లడం, విహారయాత్రలు లాంటివి ప్లాన్ చేసుకుంటారు. ఇవే సెలవులు దొంగలకు నెలవుగా మారుతున్నాయి. పట్టణాల్లో నివాసం ఉంటున్న చాలా కుటుంబాలు సెలవుల్లో ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. దీనిని దొంగలు అవకాశంగా మలుచు కుంటారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలు ఇటీవలి కాలంలో ఎక్కువగా జరుగుతున్నాయి.

పగటిపూట రెక్కీ.. రాత్రి వేళ చోరీ

తాళంవేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్న దొంగలు నగదుతోపాటు బంగారం, వెండి, వాహనాలు, ఇతర విలువైన వస్తువులను ఎత్తుకుపోతున్నారు. పగటి పూట రెక్కీ నిర్వహిస్తూ వారు టార్గెట్‌గా చేసుకున్న ఇళ్ల వద్ద పరిసరాలను పూర్తిగా అవగాహన చేసుకుంటారు. తాళం వేసిన ఇళ్లను గూగుల్ మ్యాప్‌లో లొకేషన్ పిన్ చేసుకుని అర్ధ రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పగటి పూటనే రైతులు ఇళ్లకు తాళం వేసి వ్యవసాయ పనులకు వెళుతున్న సమయంలో అదనుచూసి లూటీ చేస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..: గౌస్ ఆలం, సీపీ



దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలకు వెళతారు. ఈ సమయంలో చోరీలను నివారించడానికి పోలీస్ శాఖ తరుపున పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాము. పండుగకు వెళ్లే ప్రజలు దొంగల బారిన పడకుండా ఉండడానిక్కి జాగ్రత్తలు తీసుకోవాలి. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే డయల్ 100కు, బ్లూకోల్ట్స్ సిబ్బందికి, సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి.

24 గంటల గస్తీ ఉన్నా..

ఒక వైపు బ్లూకోల్ట్స్ పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగానే మరో వైపు దొంగలు చోరీలకు పాల్పడుతుండటం ఆందోళనను కలిగిస్తున్నది. దొంగతనాలు జరిగిన తరువాత పోలీసులు కేసు, విచారణ చేపట్టి సీసీ కెమెరాల ఆధారంగా, వేలి ముద్రల ఆధారంగా దొంగలను అరెస్టు చేస్తున్నప్పటికీ బాధితుల సొమ్ములు పూర్తిగా రికవరీ కావడం లేదు. జన సమర్ధ ప్రాంతాలు, శివారు కాలనీ కానీ.. ఏ మూలలో అయినా ఇంటికి తాళం కనపడితే చాలు.. దొంగలు రెచ్చిపోయి ఇంటిలోని విలువైన బంగారం, నగదును అపహరించుకుపోతున్నారు. ఇళ్లకు వేసిన తాళాలు అలాగే ఉండగా గొళ్లాలను చాకచక్యంగా తొలగిస్తున్నారు. దొంగతనం జరిగిన ప్రదేశాల్లో వేలి ముద్రలు పోలీసులకు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖానికి మాస్కులు, వాహనాలకు నంబర్ ప్లేట్లు తొలగించి చోరీలకు పాల్పడుతతున్నారు. ప్రజలు కూడా సరైన భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

దొంగతనాల నియంత్రణకు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు...

- ఊరెళ్లే ముందు సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. పెట్రోలింగ్ బృందాలు ఆ ఇంటిపై ప్రత్యేక నిఘా పెడతాయి.
- ఇంటిని గమనిస్తూ ఉండండని ఇరుగుపొరుగు వారికి చెప్పండి. ఇంటికి సంబంధించిన ఏవైనా అనుమానాస్పద విషయాలు ఉంటే వెంటనే తెలియజేయమని చెప్పండి.
- ఊరెళ్లేటప్పుడు ఇంట్లో డబ్బు, బంగారం ఉంచకుండా వాటిని బ్యాంకు లాకర్‌లో భద్రపరచండి. బీరువా తాళాలను ఇంట్లో పెట్టకుండా వెంట తీసుకెళ్లండి.
- ఊరెళ్తున్నట్లు సోషల్ మీడియాలో, వాట్సాప్ స్టేటస్‌లలో పెట్టవద్దు. ఇది నేరగాళ్లకు ఇల్లు ఖాళీగా ఉందని తెలియజేస్తుంది.
- ఇంటికి తాళం వేసినప్పుడు, ఇంట్లోని ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచడం మంచిది. తాళం బయటకు కనిపించకుండా డోర్ కర్టెన్ వేయాలి.
- కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగతనాలను నివారించవచ్చు. ఈ విషయంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు సహకరించాలి.
- ఉదయం పూట పూల మొక్కలు, ఇతర వస్తువులు అమ్మేవారి రూపంలో లేదా రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులపై నిఘా ఉంచాలి. అనుమానితుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- పండుగ సందర్భంగా వచ్చే ఆన్‌లైన్ షాపింగ్ ఆఫర్లపై అప్రమత్తంగా ఉండాలి. నకిలీ ఐడీలు సృష్టించి మోసాలు చేసే అవకాశం ఉంది.
- అనవసరంగా వచ్చే మెసేజ్‌లలోని బ్లూ కలర్ లింకులను ఓపెన్ చేయవద్దు. లాటరీ తగిలిందని, గిఫ్ట్ వచ్చిందని, తక్కువ ధరకు వస్తువులు ఇస్తామని వచ్చే సందేశాలను నమ్మవద్దు.
- సైబర్ నేరానికి గురై డబ్బులు పోగొట్టుకుంటే, 24 గంటలలోపు ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ అయ్యే అవకాశం ఉంది.
- సైబర్ నేరాల ఫిర్యాదు కోసం 1930 (జాతీయ హెల్ప్‌లైన్), 112, 100
- ఆన్‌లైన్ ఫిర్యాదు www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో చేయాలి.



మాజీ కలెక్టర్ కేఎస్ శర్మ మృతి

- ఉమ్మడి జిల్లాతో విడదీయరాని అనుబంధం



కేఎస్ శర్మ(ఫైల్)

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిజిల్లాకు కలెక్టర్‌గా సేవలందించిన కేఎస్ శర్మ(కంభం పాటి సుబ్రహ్మణ్య శర్మ) (80) ఆదివారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతిచెందారు. నిజాయితీ, నిబద్ధత గల ఉత్తమ అధికారిగా గుర్తింపు పొందిన ఆయనకు ఉమ్మడి జిల్లాతో విడదీయ రాని అనుబంధం ఉంది.. ఆయన మృతితో కవులు, కళాకారులు, నగరవాసులు, ప్రత్యక్షంగా చూసినవారు గతస్మృతులను నెమరు వేసుకున్నారు. ఆయన హయాంలో కరీంనగర్‌లో త్యాగరాజ లలిత కళాపరిషత్, జవహర్ బాలకేంద్రం, టీఎల్ కే ఓపెన్ ఆడిటోరియం ఏర్పాటుచేశారు. నెహ్రూ యువకేంద్ర బలోపేతానికి కృషిచేశారు. అనేక సంక్షేమ కార్యక్రమాలకు నాంది పలికిన ఆయన ఫిలింభవన్‌తోపాటు అనేకసంస్థలకు స్థలాలు మంజూరు చేశారు. సోమవారం ఆయన అంత్యక్రియలు జరుపనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శర్మ మృతికి పలువురు కవులు, కళాకారులు, సాహితీ కళాసంస్థల బాధ్యులు, నగరవాసులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

సెరికల్చర్‌లో రాజన్న సిరిసిల్లకు జాతీయస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ మల్లికార్జున

సిరిసిల్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సెరికల్చర్ అభివృద్ధిలో రాజన్న సిరిసిల్ల జిల్లాజాతీయస్థాయి అవార్డును సాధించింది. జిల్లాలోని రైతులకు సెరికల్చర్‌లో పట్టుపురుగుల సాగుకు సంబంధించిన అవగాహన కల్పించడం, సాగు పద్ధతుల్లో శిక్షణ ఇవ్వడంలో జిల్లాను ముందు వరుసలో సెరికల్చర్ సైంటిస్ట్ డాక్టర్ మల్లికార్జున, అసిస్టెంట్ సెరికల్చర్ అధికారి జగన్‌రావులు కృషిచేశారు. ఇందుకు సిల్క్‌బోర్డునుంచి అవార్డులు అందుకున్నారు. జిల్లాసమన్వయకర్తలుగా గ్రామీణ ప్రాంతాల్లో విజయవంతంగా ప్రచార కార్యక్రమాలు, సమావేశాలు సాంకేతిక ప్రదర్శనలు ఇస్తూ రైతులకు అవగాహన కల్పించినందుకు జిల్లాకు అవార్డులు లభించాయి. ఆదివారం బెంగళూరులోని సెంట్రల్ సిల్క్‌బోర్డు ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అదనపు డైరెక్టర్ డైరెక్టర్ లత, సైంటిస్ట్ డాక్టర్ మల్లికార్జున అవార్డులు అందుకున్నారు.

బీడీ పరిశ్రమను జీఎస్టీ నుంచి మినహాయించాలి



మాట్లాడుతున్న బీడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

కోరుట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ నుంచి బీడీ పరిశ్రమను మినహాయించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ సభ్యులు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఆదివారం కోరుట్ల పట్టణంలోని బీడీవర్కర్ యూనియన్ భవనంలో కరీంగనగర్, జగిత్యాల, కామారెడ్డి, రాజన్నసిరిసిల్ల, నిర్మల్, మంచిర్యాల జిల్లాల ప్రతినిధుల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ బీడీ కార్మికులకు అంక్షలులేకుండా పెన్షన్‌కింద జీవనభృతి4000 రూపాయలు చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీఎస్టీపై బీడీపరిశ్రమను మినహాయించే విధంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. వచ్చే జనరల్‌కౌన్సిల్ సమావేశం అక్టోబరు20వ తేదీన నిజామాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహిస్తామని జిల్లా ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రఅధ్యక్షుడు చింతభూమేశ్వర్, కార్యదర్శి సూర్యశివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ హరిత, భారతి రాష్ట్రకమిటీ సభ్యులు గంగాధర్, అరుణ, శివకుమార్, భూమయ్య పాల్గొన్నారు.

ధర్మపురిలో శేషప్ప కళావేదికపై మహా సత్సంగ్



మహా సత్సంగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భక్తులు

ధర్మపురి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలో గల శేషప్ప కళావేదికపై ధర్మపురి ప్రఖండ ఆధ్వర్యంలో ఎనిమిది సత్సంగాలను కలుపుతూ మహా సత్సంగ్ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భాగ్యనగర్ క్షేత్ర సత్సంగ్ ప్రముఖ్ శాలివాహన పండరినాథ్ మాట్లాడుతూ సత్సంగ్ ద్వారా మనసు, వాక్కు శుద్ధి జరుగుతుందని తెలిపారు. హనుమాన్ చాలీసా పారాయణం 21, 21, 108 సార్లు పఠనం చేయడం ద్వారా ఒక్కో ఫలితం పొందగలమని తులసీదాసు తెలిపారని ఆయన అన్నారు. గ్రామాల్లో ప్రతి దేవాలయ కేంద్రంగా సత్సంగ్ నిర్వహణకు కృషిచేయాలని ఆయన కోరారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో సత్సంగ్ మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు పురుషోత్తమాచార్యులు, పూర్వపర్తి సమయ కార్యకర్త జయప్రద, సామాజిక సమరసత టోలి సభ్యులు అల్లం దుర్గప్రసాద్, జిల్లాకార్యదర్శి కస్తూరిరాజన్న, ముత్యపు రమేష్, మామిడాల రవీందర్, వెలగందుల బుచ్చన్న, వెలగందుల రవి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో ఎంగిలి పూల వైభవం

- రాజన్న ఆలయంలో ఆకట్టుకున్న బతుకమ్మ, దాండియా ఆటలు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాములాయే చందమామ.. అంటూ మహిళలు, యువతులు ఎంగిలి పూల బతుకమ్మను వేములవాడ పట్టణం, రాజన్న ఆలయంతో పాటు పల్లేల్లో ఎంతో వైభవంగా చేపట్టారు. మహిళలు, యువతులు, చిన్నారులు సాంప్రదాయ దుస్తుల్లో తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చుకుని కూడళ్ల వద్ద బతుకమ్మలను పెట్టి తెలంగాణ సంప్రదాయ పాటలతో ఆటలాడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఎంగిలి పూల తొలిరోజు బతుకమ్మ సందర్భంగా మండలంలోని ఆరెపల్లి, సంకెపల్లి, గొల్లపల్లి, రుద్రవరం, అనుపురం, నాంపల్లి, కొడుముంజ, శాభాష్‌పల్లి, మారుపాక, చంద్రగిరి, చింతలఠాణ, చీర్లవంచ గ్రామాల్లో వాడవాడన డీజే సౌండ్లతో బతుకమ్మ పాటలు మారుమోగిపోయాయి. మహిళలు బతుకమ్మల చుట్టూ వలయాకారంలో క్రమపద్ధతిలో తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడగా, యువతులు బతుకమ్మ పాటలతో కోలాటం ఆడుతూ నృత్యాలు చేశారు. అనంతరం గ్రామ శివారులోని చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



రాజన్న ఆలయంలో దాండియా ఆడుతున్న యువతులు, మహిళలు

రాజన్న ఆలయంలో..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం ఎంగిలి పూల బతుకమ్మలు కన్నుల పండువగా జరిగాయి. పట్టణంలోని మహిళలు బతుకమ్మలతో రాజన్న ఆలయానికి తరలివచ్చి ఆలయంలో బతుకమ్మలను నిలిపి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడారు. డిజే సౌండ్ మధ్య యువతులు ఆడిన దాండియా ఆటలు, మహిళలు ఆడిన కోలాటాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం రాజన్న ఆలయ ధర్మగుండంలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వెంట తీసుకువెళ్లిన ఫలహారాన్ని ఇచ్చిపుచ్చుకున్నారు.



రాజన్న ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రసాయన శాస్త్ర విభాగంలో మంజులకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మంజుల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగంలో పరిశోధక విద్యార్థి తిరుకోవెల మంజులకు పరీక్షల నియంత్రణ విభాగం డాక్టరేట్ ప్రదానం చేసింది. 'సింథసిస్ ఆఫ్ పైరాన్ అండ్ పైపిరిడిన్ డెరివేటివ్స్ యూసింగ్ నావెల్ మెథడాలజీస్' అనే అంశంపై డాక్టర్ జయంతి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. మంజుల ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగంలో అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్‌కు, రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తీ, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రమాకాంత్, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి.నమ్రత, బోర్డ్ఆఫ్ స్టడీస్ చైర్ పర్సన్ డాక్టర్ ఎం.సరసిజకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

- 23 గేట్ల ద్వారా....73,540 క్యూసెక్కులు దిగువకు



దిగువకు దూకుతున్న శ్రీరాంసాగర్ నీరు

జగిత్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఆదివారం వరద నీరు తగ్గింది. 23 గేట్లు పైకి ఎత్తి 73,540 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 95,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి తిరిగి ప్రారంభమైన ఎత్తిపోతలు

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఒక పంపుద్వారా తిరిగి నీటి ఎత్తిపోతలు ఆదివారం ప్రారంభం అయ్యాయి. 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.26టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వచ్చిన 3200క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి(మిడ్ మానేరు) ప్రాజెక్టుకు ఆదివారం 6300క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 4500మానేరు, ములవాగు ద్వారా 1800 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. దిగువకు మూడు గేట్ల ద్వారా 5500 క్యూసెక్కులు ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు క్యూసెక్కులు, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3200 నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం317.89 ఉండగా, సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.273 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ఎల్ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్ : దిగువ మానేరు జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టం 24.034టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.645టీఎంసీల నీరునిల్వ ఉంది. మోయతుమ్మెద వాగు నుంచి 5909క్యూసెక్కులు, మిడ్‌మానేరు నుంచి 5500 క్యూసెక్కులు, ఎగువ కాకతీయకాలువ నుంచి 200క్యూసెక్కులు మొత్తం 11,609క్యూసెక్కులు ఎల్ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. నాలుగు గేట్ల నుంచి 8వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ నుంచి 4500క్యూసెక్కులు, మిషన్‌భగీరథ, ఆవిరిరూపంలో 309క్యూసెక్కులు మొత్తం 12,809క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతోంది.

బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు చేసిందేమీ లేదు

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు చేసిందేమీ లేదని రాష్ట్ర ఎస్సీఎస్టీమైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ నియోజకవర్గంలో సాధించిందేమీ లేదని, తననోటికి వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన అనంతరం ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నట్లు ఆయన గుర్తుచేశారు. ఆరు గ్యారెంటీల్లో నాలుగు అమలు చేసి ఎంత కష్టమైన మరోరెండు గ్యారెంటీ పథకాలను ఇచ్చి తీరుతామని ఆయన తెలిపారు. ప్రతీ గ్రామంలో పేద వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేసి వారంవారం లబ్ధిదారులకు డబ్బులు చెల్లిస్తున్నామని ఆయన అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టలేదని ఆరోపించిన కొప్పుల ఈశ్వర్ ఇంటి ప్రారంభోత్సవానికి పిలిస్తే వస్తారా అని ఆయన ప్రశ్నించారు. చెగ్యాం ముంపు బాధితులకు నష్టపరిహారం ఇప్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నీరు సిద్దిపేటకు తరలించుకపోతుంటే కొప్పులఈశ్వర్ నియో జకవర్గానికి ఏమి చేశారో చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. అధికారం కోల్పోయి అక్కసుతో కొప్పుల ఈశ్వర్ ఆరోపణలు మానుకోవాలని ఆయన సూచించారు. యూరియా కొరత దేశమంతా ఉందని ఇందుకు కేంద్ర ప్రభుత్వమే కారణమని ఆయన పేర్కొన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ఎంపీలు యూరియా కొరత గురించి సంబంధిత మంత్రులను కోరలేదని, కాంగ్రెస్ ఎంపీలు మాత్రమే యూరియా అందించాలని కోరడం జరిగిందని ఆయన అన్నారు.

బీఆర్ఎస్‌లో చాలామంది నాయకులు తమతో టచ్‌లో ఉన్నారని తాము గేట్లు తెరిస్తే మీపక్కన ఎవరు కూడా మిగలరని ఆయన తెలిపారు. ధర్మపురి పట్టణంలో త్వరలో డిగ్రీకళాశాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీసభ్యుడు, కాంగ్రెస్‌మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, పట్టణకాంగ్రెస్ అధ్యక్షుడు చీపిరిశెట్టిరాజేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంట సుధాకర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పం తిరుపతి, ధర్మారం ఏఎంసీ చైర్మన్ రాప్లానాయక్, జిల్లాకాంగ్రెస్ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, ప్రదీప్‌రెడ్డి, జంగిలి ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సౌదీలో అనారోగ్యంతో తక్కళ్లపల్లి వాసి మృతి

కథలాపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన సంగ మల్లయ్య(59) అనే గల్ఫ్ వలసజీవి అనారో గ్యంతో సౌదీలో రెండురోజుల కిందట మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలి పిన వివరాల ప్రకారం.. మల్లయ్య 25 సంవ త్సరాలుగా సౌదీలో ఓ అరబ్ షేక్ ఇంట్లో తోట మాలిగా పనిచేస్తున్నాడు. అయితే ఈ మధ్య మెడుకు సంబంధించిన సమస్యతో ఇబ్బందులు పడుతుండగా ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. ఆ సమస్య తీవ్రం కావడంతో మృతిచెందాడు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు. తండ్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న కొడుకు దుబాయి నుంచి స్వగ్రామం చేరుకున్నాడు. కాగా మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేలా చూడాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మాజీ సర్పంచ్ అల్లకొండ లింగం గౌడ్ కోరగా ఎంబసీ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. అంబులెన్స్ వసతి ఉచితంగా కల్పిస్తానని అదేవిధంగా గల్ఫ్ పాలసీలో భాగంగా అందించే ఐదు లక్షల రూపాయలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు లింగంగౌడ్ తెలిపారు.



మల్లయ్య(ఫైల్)

బీఆర్ఎస్ బలోపేతానికి పనిచేయాలి

పెగడపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పెగడపల్లి మండలంలోని ఎల్లాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మండల నాయకులు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రంగు గంగాధర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ముద్దం మల్లేశం, కరుణాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, లక్ష్మణ్, సత్యనారాయణరెడ్డి, ఆనంద్, రాజశేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం



సన్మానం చేసిన నాయకులు

కొడిమ్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అండర్-19 వాలీబాల్ టీంలో మండలంలోని హిమ్మతురావుపేట గ్రామ క్రీడాకారులు జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, తిర్మలాపూర్ సింగిల్ విండో చైర్మన్ పోలు రాజేందర్ క్రీడాకారులను ఆదివారం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. వాలీబాల్ టీం కోచ్ ఎంబ్రికాయల శ్రీనివాస్, శనివారంపేట మాజీ ఉపసర్పంచు అయిలయ్య, బీఆర్ఎస్ నాయకులు రాజేందర్, నర్సయ్య ఉన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా గుర్తించాలి



రాయికల్‌లో బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జీవన్ రెడ్డి, జగిత్యాల, కోరుట్లలో పాల్గొన్న నాయకులు

మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

రాయికల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి దశ ఉద్యమం నుంచి పదవి కాంక్ష లేకుండా ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిన కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటాన్ని పాఠ్యాంశంలో చేర్చడంతో పాటు తెలంగాణ జాతిపితగా గుర్తించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించినట్లు మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ పట్టణంలోని పద్మశాలి సేవా సంఘంలో ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రాంత ప్రజలకు విముక్తి దొరకాలంటే ప్రత్యేక రాష్ట్రం తప్ప మరోదారి లేదనుకున్న బాపూజీ తెలంగాణ ఉద్యమానికి నాంది పలికారని అన్నారు.

కార్యక్ర మంలో రాయికల్ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు బోగ రాజేశం, ఉపాధ్యక్షుడు దాసరి గంగాధర్, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేష్, కోశాధికారి ఆడెపు నర్సయ్య, యువజన సంఘం అధ్యక్షుడు సామల్ల సతీష్, పోపా సంఘం బాధ్యుడు దాసరి రామస్వామి, మండల బాధ్యులు గాజెంగి అశోక్, యువజన సంఘం ఉపాధ్యక్షుడు సింగని సతీష్, ప్రధాన కార్యదర్శి ఆడెపు రాజీవ్, కోశాధికారి బొమ్మకంటి నవీన్, మాజీ అధ్యక్షుడు మ్యాకల కాంతారావు, ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల అగ్రికల్చర్: మూడు దశల్లో సాగిన తెలంగాణ సాధన ఉద్యమానికి సాక్షిగా కొండా లక్ష్మణ్ బాపూజీ ఉన్నారని జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక అంగడిబజార్‌లో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పద్మశాలి సేవాసంఘం అధ్యక్షుడు భోగ గంగాధర్, ఉపాధ్యక్షులు భోగ రాజ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని పద్మశాలి సేవా సంఘ భవనంలో జరిగిన కార్యక్రమంలో సంఘం నాయకులు అంకం జనార్దన్, కె సత్యనారాయణ, భూమేష్, సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

మల్యాల: మండలంలో బ్లాక్ చౌరస్తా వద్ద గల కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పద్మశాలి సంఘ ప్రతినిధులు, సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

మెట్‌పల్లి టౌన్: మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ శాస్త్రి చౌరస్తా వద్ద జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, యూత్ అధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్, ఆడెపు రమణ, గాజా రాజారెడ్డి జాకీర్ ముకిం మహేందర్ తాండ్ర నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ధ్యావనపెల్లి రాజారాం, పట్టణ వార్డుల కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ, కిసాన్ సెల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఏలాల జలపతిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శంకర్, నాయకులు, పద్మశాలిలు, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఫకీరు కొండాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు సింగని మారుతి, నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల/కోరుట్లరూరల్: పట్టణంలోని కార్గిల్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, పద్మశాలి సంఘ పట్టణ అధ్యక్షుడు గుంటుక ప్రసాద్, వివిధ పార్టీల నాయకులు, పద్మశాలి సంఘ నాయకులు పాల్గొన్నారు. కోరుట్ల రూరల్ మండలంలోని జరిగిన కార్యక్రమంలో పద్మశాలి సంఘ నాయకులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నంలో నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

మున్సిపాలిటీల్లో గాడి తప్పుతున్న పాలన

(5వ పేజీ తరువాయి)

ఫిర్యాదులే కాకుండా సామాజిక మధ్యమాలు, కంట్రోల్ రూం, టోల్‌ఫ్రీ నంబర్ ఫిర్యాదులపై స్పందించాలి. ఆస్తి, నీటి, గ్యారేజ్ చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ పన్నులు వసూలు చేయాలి. మరణ ధ్రువపత్రాల జారీకి విచారణ చేయాలి. రోడ్లపై గుంతలు, నీటినిల్వలు, మట్టి కుప్పలు, మూతలేని మ్యాన్‌హోళ్లు, పుట్‌పాత్, కబ్జాలు, వెలగని వీధి లైట్లు, ఇంటింట చెత్త సేకరణ తీరు, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ, నాలాలు, డ్రెయినేజీల్లో వ్యర్థాలు పేరుకుపోవడం, దోమల సమస్య, జంతు పక్షుల కళేబరాలు, దివ్యాంగులు, వృద్ధులకు గుర్తింపు కార్డులు తదితర సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలి. అనధికారి భవన నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల కబ్జాలు, అక్రమంగా వెలిసిన ఫ్లెక్సీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై విచారణ, పురోగతిపై దృష్టిసారించాలి. ఆయా విభాగాలకు చెందిన ఏఈలు, ఆర్ఐలు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, డివిజన్ల సిబ్బంది, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేయాలి.

● ఏం చేస్తున్నారు..

వార్డు ఆఫీసర్లు ఆస్తి, నీటి చార్జీలను అరకొరగా వసూలు చేస్తున్నారు. దీనికి కూడా బిల్ కలెక్టర్ల సహకారం తీసుకుంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే, పురోగతి, గృహలక్ష్మి, పెన్షన్ల కోసం లబ్ధిదారుల విచారణ చేసి చేతులు దులుపుకుంటున్నారు. వార్డు ఆఫీసర్ పాలనకు సంబంధించిన ఇతర పనులపై ఏ మాత్రం చొరవ తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఆయా వార్డుల్లో సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. ప్రభుత్వం నుంచి వేతనాలు పొందుతూ నామమాత్రంగా విధులు నిర్వర్తిస్తూ కాలక్షేపం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పకడ్బందీగా పర్యవేక్షిస్తాం..



-బి సత్యప్రసాద్, కలెక్టర్

జిల్లాలోని మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్ల పనితీరుపై ఎప్పటికప్పుడు పకడ్బందీగా పర్యవేక్షణ నిర్వహిస్తాము. విధుల్లో నిర్లక్ష్యం వహించే వార్డు ఆఫీసర్లపై చర్యలు తీసుకుంటాము. మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేకాధికారులు పర్యవేక్షణ నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకుంటాము. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే అధికారుల దృష్టికి ప్రజలు తీసుకవెళ్లాలి. పరిష్కారానికి తప్పనిసరిగా కృషి చేస్తాము.

ఏఎస్ఐ శ్రీనివాస్‌కు ఘన సన్మానం



ఏఎస్ఐ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నిత్య జనగణమన బృందం సభ్యులు

జగిత్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డుకు ఎంపికయిన జగిత్యాల స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ రాజేశుని శ్రీనివాస్‌ను నిత్య జనగణమన బృందం సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలో నిత్య జనగణమన సభ్యుడయిన రాజేశుని శ్రీనివాస్‌ను శాలువలతో సత్కరించారు. 2025 ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఏఎస్ఐ రాజేశుని శ్రీనివాస్ ఎంపిక కావడం సంతోషకరమన్నారు. గత ఎనిమిదేళ్లుగా జగిత్యాలలో ప్రతి రోజు నిర్వహించబడుతున్న నిత్య జాతీయ గీతం - నిత్య జనగణమన కార్యక్రమంలో ఫౌండర్ సభ్యునిగా కొనసాగుతూ దేశభక్తిని చాటుతున్న ఏఎస్ఐ రాజేశుని శ్రీనివాస్ మెడల్ ఎంపిక కావడం ఆనందకరమన్నారు. ఈకార్యక్రమంలో జగిత్యాల నిత్య జనగణమన నిర్వాహకులు ఉత్తూరి గంగాధర్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కప్పల శ్రీకాంత్, బృందం సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ సాంస్కృతిక వారసత్వ సంపద బతుకమ్మ

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంస్కృతిక వారసత్వ సంపదకు చిహ్నం బతుకమ్మ అని ప్రముఖ దంత వైద్యురాలు డాక్టర్ సృజన అన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రత్యేకతను ప్రతిబింబించే ఈ పూల పండగలో వైద్యులు, మహిళలు, ఉత్సాహంగా ఆడి, పాడి ఉత్సాహంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రావిటీ స్కూల్ ప్రిన్సిపాల్ సంధ్య, వైద్యురాళ్లు స్వాతి, మమత, రమ్యకృష్ణ, కావ్య, దీక్షిత, వర్ణారావు, ఎడమల లీనారెడ్డి, రజినీ, జ్యోతిక, మౌనిక, నీలిమా, శాంతి, సంజన, వనిత, లావణ్య, అలేఖ్య, రవళి, లహరిక తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టులు అందజేత



క్రీడాకారులకు టీ షర్టులను అందిస్తున్న నాయకులు

కొడిమ్యాల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం కొడిమ్యాల ప్రీమియర్ లీగ్-2లో పాల్గొంటున్న కేసీఆర్ బీఆర్ఎస్ క్రికెట్ టీం సభ్యులు 21మందికి బీఆర్ఎస్ మండల నాయకులు టీషర్టులను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు సుమారు 10వేల రూపాయల విలువైన టీషర్టులను సమకూర్చారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు పులి వెంకటేష్‌గౌడ్, కొత్తూరి స్వామి, గడ్డం లక్ష్మారెడ్డి, పాదం శ్రీనివాస్, కందుల రమణారెడ్డి, ఎంబ్రికాయల శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం కార్యవర్గం

మల్యాల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేటలో స్వర్ణకార సంగం నూతన కార్యవర్గంను ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా తుమ్మనపల్లి సత్యం, ఉపాధ్యక్షునిగా శంకరయ్య, కోశాధికారిగా తులసీదాస్, కార్యదర్శిగా విఠలచారీతో సభ్యులను ఎన్నుకున్నారు.

మై భారత్ ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడకారులు

బుగ్గారం సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మైభారత్ ఆధ్వర్యంలో మండలం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో బ్లాక్ లెవెల్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. పోటీలకు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిస్ట్రిక్ట్ చైల్డ్ మ్యారేజ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ భూమేష్, పంచాయతీ సెక్రెటరీ అక్బర్, స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి పోటీలు ప్రారంభించారు. కబడ్డీ విభాగంలో బుగ్గారం, వెల్గొండ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. వాలీబాల్ 12 జట్లు, కబడ్డీ ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో మై భారత్ జగిత్యాల యువజన వలంటీర్ మారం గణేష్, ప్రోగ్రాం ఆర్గనైజర్ సుంకం ప్రశాంత్, రాహుల్, సుశాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రోత్సవాలకు ఆలయాలు ముస్తాబు



విద్యుత్ దీపాల అలంకరణలో కోరుట్ల వేంకటేశ్వర స్వామి ఆలయం, మహితాపూర్ కనకదుర్గాదేవి

కోరుట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ దేవాలయాలు శరన్నవరాత్రోత్సవాలకు ముస్తాబు అవుతున్నాయి. పట్టణంలోని వేంకటేశ్వర దేవాలయం, అష్టలక్ష్మి, భారతీయ సమితి, త్రిశక్తి, కాలేజీ గ్రౌండ్ దుర్గాదేవిలతో పాటు వివిధ సంఘాల ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లును చేస్తున్నారు. దేవాలయాల అవరణలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని అంజనేయ స్వామి ఆలయం సోమవారం నుంచి అక్టోబరు 2వరకు నిర్వహించే దేవి శరన్నవరాత్రోత్సవాలకు ముస్తాబైంది. హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో శరన్నవరాత్రోత్సవాలను ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. ఆలయం ఎదుట చలువ పందిళ్లను వేయించారు. 22న బాలాత్రిపుర సుందరిదేవి, 23న గాయిత్రీదేవి, 24న అన్నపూర్ణదేవిగా అలంకారణ అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 25న కాత్యాయనిదేవి, 26న మహాలక్ష్మిదేవి, 27న లలితాదేవి, 28 మహాచండీదేవి, 29న సరస్వతీ దేవి అలంకరణతో పాటు చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 30న దుర్గాదేవి, అక్టోబరు 1న మహిషాసుమర్దని దేవి, అక్టోబరు 2న రాజరాజేశ్వరీ దేవిగా అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారని ఆలయ నిర్వహకులు, పూజారి భాస్కర్ తెలిపారు.

ఇబ్రహీంపట్నం: దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని గోదూర్, తిమ్మాపూర్, యామాపూర్, వేములకుర్తి, మూలరాంపూర్, ఎర్దండి, కోమటి కొండాపూర్, వర్ష కొండ, ఇబ్రహీంపట్నం గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. దసరా నవరాత్రుల్లో భాగంగా తొమ్మిది రోజులు ఆయా గ్రామాల్లో స్వామివారి ఉత్సవ మూర్తులను వీధుల గుండా పల్లకిలో ఊరెగిస్తారు. మొదటి రోజున పెద్దశేష వాహనంపైన, రెండో రోజు చిన్నశేష వాహనం, మూడో రోజున సింహ వాహనం, నాలుగో రోజున కల్పవృక్ష వాహనం, ఐదో రోజున గరుడ వాహనం, ఆరో రోజున హనుమంత వాహనం, ఏడో రోజున చంద్రప్రభ వాహనం, ఎనిమిదో రోజున అశ్వ వాహనం, చివరి రోజైన తొమ్మిదవ రోజున స్వర్ణ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగిస్తారు. మండలంలోని అన్ని గ్రామాల్లో దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా అమ్మవారి మండపాలను అందంగా అలంకరిస్తున్నారు.

రాయికల్: మండలంలోని మహితాపూర్ శ్రీగిరి పర్వతంపై కొలువుదీరిన కనక దుర్గాదేవి ఆలయం నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. సోమవారం అమ్మవారు ప్రతి రోజు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాల్లో భాగంగా నిత్య కుంకుమార్చన, అభిషేకాలు, చండీ హోమం, సరస్వతి పూజ, బోనాలువంటి కార్యక్రమాలు జరుగనున్నాయి. భక్తులు అమ్మవారి సన్నిధిలో ముడుపులు కట్టి కోర్కెలు తీర్చుకుంటారని, ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమటీ సభ్యులు కోరారు.

క్రిష్ణవేణిలో బతుకమ్మ సంబరం

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక బీట్ బజారులో గల శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు ఆదివారం అంబరాన్నంటాయి. చిన్నారులు, ఉపాధ్యాయులు ఈ వేడుకకు హాజరై పూల పండగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు దివ్య, మల్లీశ్వరీ, ఫిరోజ్, జానకిరామ్, రామ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని ఆయా గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల వేతనాలను చెల్లించాలని కోరుతూ ఆయా గ్రామాల కారోబార్లు జగిత్యాల రూరల్ ఎంపీవో రవిబాబుకు కార్యాలయంలో ఆదివారం వినతిపత్రం అందించారు. వేతనాలు రాకపోవడంతో బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలు జరుపుకోకుండా పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడిందని, వెంటనే వేతనాలు చెల్లించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎంపీవో సానుకూలంగా స్పందించి సమస్యను డీపీవో దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

విప్‌ను కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు



ఎమ్మెల్యేను కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు

కథలాపూర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ, సోషల్ మీడియా కోఆర్డినేటర్ కోఆర్డినేటర్ మనవత్తు మహిపాల్, కో కోఆర్డినేటర్ పానుగంటి శ్యాం ఆదివారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిశారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించినట్లు చెప్పారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పాలనను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా జంగా రంజిత్, కడారి ప్రణయ్ ఉన్నారు.

అన్నప్రసాద వితరణ

కోరుట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంకటేశ్వర దేవాలయ సమీపంలో ఆదివారం పితృ అమవాస్య సందర్భంగా సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించంగా విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గో మాతకు ప్రత్యేక పూజలను నిర్వహించిన ధర్మ ప్రచార సమితి సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచార సమితి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కోరుట్ల వాసి మృతి

తంగళ్లపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్మనగర్ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. కారులో దంపతులు సిద్దిపేట నుంచి సిరిసిల్ల వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొనడంతో జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన శ్రీధర్(45) మృతి చెందగా, భార్య లక్ష్మి గాయపడింది. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం

జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. పట్టణంలోని స్థానిక మినిస్టేడియంలో నిర్వహిస్తున్న జగిత్యాల ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలను జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, పట్టణ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా, యువతలో అవగాహన నిమిత్తం జగిత్యాల ప్రీమియర్ క్రికెట్ లీగ్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. యువత డ్రగ్స్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సూచించారు కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ రవికిరణ్, ఏఆర్ ఎస్ఐ వినోద్‌కుమార్, మాజీ కౌన్సిలర్ చుక్క నవీన్, లీగ్ నిర్వాహకులు యాకుబ్‌సోని, అబ్దుల్ హఫీజ్ పాల్గొన్నారు.



అతిథులను సన్మానిస్తున్న నిర్వాహకులు

ముందస్తు దసరా ఉత్సవాలు

మెట్‌పల్లి టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మెట్‌పల్లి పట్టణ కళనగర్, రాంనగర్, ఆదర్శనగర్ వార్డుల ఆధ్వర్యంలో ముందస్తు శతాబ్ది దసరా ఉత్సవాలను, ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాల కార్యక్రమాన్ని స్థానిక సరస్వతి శిశు మందిర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 108 మంది ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారిని సభ్యుడు బూర్ల దక్షిణామూర్తి, డాక్టర్ వెంకటేశ్వర్లు, వివేకానంద బస్తీ ప్రముఖ్ పోతు లక్ష్మణ్, ప్రాంత సహ సద్భావన ప్రముఖ్ గోనె భూమయ్య, జిల్లా కార్యవా హ గోల్కొండ నాగరాజు, నగర కార్యవాహ మామిడాల శివకల్యాణ్, జిల్లా వ్యవస్థ ప్రముఖ్ వీర్ల వెంకటేశ్వర్లు, పాలోజీ మహేష్‌చారి, చిట్యాల శ్రవణ్‌కుమార్ ఆర్య, మంగ అరుణ్, బెజ్జారపు మురళి, గుర్రాల ప్రేమ్‌కుమార్, ఎనగందుల హనుమాన్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సిబ్బంది కొరత

- ఐదు ఏఎన్ఎం, మూడు హెల్త్ అసిస్టెంట్లు పోస్టులు ఖాళీ
- సమయానికి అందని వైద్య సేవలు




గొల్లపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

గొల్లపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యారోగ్య శాఖ సిబ్బంది కొరతతో తల్లడిల్లుతోంది. దీంతో మారుమూల గ్రామాల ప్రజలకు సమయానికి వైద్యసేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొంత కాలంగా సిబ్బంది కొరతతో కునారిల్లుతుండడంతో మండల ప్రజలు ప్రైవేట్ అసుపత్రులను ఆశ్రయిస్తూ జేబులకు చిల్లులు పడుతున్నాయి. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్నప్పటికీ వైద్యారోగ్య శాఖ సిబ్బందిని నియమించకపోవడంతో ఉన్న సిబ్బందికి పని భారం తప్పడం లేదు. అయినప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొత్తం 16 మంది ఏఎన్ఎమ్‌లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 11 మంది ఏఎన్ఎమ్‌లు విధులు నిర్వహిస్తున్నారు. అందులో మొదటి ఏఎన్ఎమ్ పోస్టులు ఐదు ఖాళీగా ఉండగా, మూడు హెల్త్ అసిస్టెంట్లు పోస్టులు, ఒక సూపర్‌వైజర్ పోస్టుతో పాటు ఐదు ఆశా కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రజలకు సత్వర సేవలు అందడంలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండలంలో మొత్తం 27 గ్రామాలు ఉండగా అరకొర సిబ్బందితో మండల వాసులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పోస్టులను భర్తీ చేసి వైద్య సేవలు సకాలంలో సక్రమంగా అందేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..

డాక్టర్ యాంసాని శ్రీకాంత్, మండల వైద్యాధికారి



ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొంతకాలంగా వైద్యారోగ్య శాఖ సిబ్బంది కొరత వెంటాడుతోంది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించాం. ఇటీవల నిర్వహించిన ఏఎన్ఎమ్‌ల పరీక్ష ఫలితాలు విడుదలైన అనంతరం ఖాళీ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉంది. వీలైనంత మేర ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం.